క్లుప్తంగా

నేడు నల్లవాగు నీటి విడుదల

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టుకు ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సాగునీరు విడుదల చేస్తారని సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జేఈ సూర్యకాంత్ శనివారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 1,493 ఫీట్లు కాగా.. పూర్తిస్థాయిలో నిండి అలుగుపై నుంచి నీరు పరవళ్లు తొక్కుతుంది. 1,146 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉంది. దీంతో కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేసేందుకు నిర్ణయించారు.

ఖేడ్ ఆర్డీఓ మళ్లీ బదిలీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్డీఓ కొముురయ్య బదిలీ అయ్యారు. గత మూడునెలలుగా ఇక్కడకు వచ్చిన ఇద్దరు ఆర్డీఓలు విధుల్లో చేరక ముందే ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారం క్రితమే ఆర్డీఓగా కొమురయ్య ఇక్కడకు బదిలీపై రాగా నాలుగురోజుల కిందటే ఆయన విధుల్లో చేరారు. తాజాగా ఆయనను బెల్లంపల్లి ఆర్డీఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. ధర్మపురి నుంచి వెంకటేశ్‌కు పదోన్నతి కల్పిస్తూ ఖేడ్ ఆర్డీఓగా పోస్టింగ్ ఇచ్చింది.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చింతా ప్రభాకర్, తదితరులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆగస్టు 13న కోరుట్లలో నిర్వహించే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పాలడుగు పాండు, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

'సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి'

జహీరాబాద్ టౌన్: విద్యాసంస్థల్లోకి సంఘాల నాయకులు, ప్రభుత్వ వ్యతిరేక పత్రికలు, మీడియాను అనుమతించవద్దని డీఈఓ జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ మాట్లాడారు. విద్యాశాఖ ఇచ్చిన సర్కులర్ అప్రజాస్వామ్యంగా ఉందని అన్నారు. సమావేశాల్లో సంఘాల నాయకులు రాజేష్, చంద్రవర్ధన్ హరీశ్, దేవరాజ్, చంద్రకాంత్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు తరలిన తపస్ నాయకులు



సంగారెడ్డికి తరలివెళ్తున్న నాయకులు

నారాయణఖేడ్: సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రకు ఖేడ్ నుంచి తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తరలివెళ్లారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని నినాదాలు చేశారు. సంఘం ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు చంద్రకాంత్, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, డివిజన్‌లోని మండలాల బాధ్యులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

కల్హేర్ (నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని బీబీపేట శివారులో జరిగింది. గ్రామానికి చెందిన యొన్నం జనార్దన్‌రెడ్డికి చెందిన పశువులను సొంత వ్యవసాయ భూమిలో మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

ఎమ్మెల్యేకు పరామర్శ

పటాన్‌చెరు: కుమారుడి మృతితో తీవ్ర విషాదంలో మునిగిపోయిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి శనివారం పరామర్శించారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన కుటుంబం ఈ విషాదం నుంచి త్వరగా బయటపడాలని భగవంతుడిని ప్రార్థించారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మఠం భిక్షపతి



సంగారెడ్డిటౌన్: భారీగా హాజరైన ప్రజలు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లావ్యాప్తంగా మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని సందడి చేశారు. గౌడచర్లలో చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయిలో నిర్వహించిన ఇంతేశేవాలి దర్గాలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రార్థనలు చేశారు.



ఝరాసంగం: ఎల్గోయిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రార్థనలు



సంగారెడ్డిటౌన్: పీర్ల ఊరేగింపులో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడండి

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో రెండో రోజు రాజకీయ శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. ఆగస్టు 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించే మహాపాడవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో హక్కుల కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు మల్లేశ్, సాయిలు నాయకులు రాజయ్య, బాగారెడ్డి, పాండురంగారెడ్డి, ప్రవీణ్, యూనియన్ నాయకులు, తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

మణిపూర్ సీఎంను బర్తరఫ్ చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): మణిపూర్ సీఎంను బర్తరఫ్ చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే విధంగా చర్యలు చేపట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, సామాజిక ఉద్యమకారుడు అనంతయ్య కోరారు. శనివారం సంగారెడ్డిలోని మహనీయుల విగ్రహాల వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు జరుగుతుంతే కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సామజిక సంఘాల నాయకులు సంగమేశ్వర్, ఎర్రోళ్ల పోచన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు మల్లేశం, మహేష్, గంగారం, ఆనంద్, రాజేష్, అనిల్, బాలరాజ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉత్సవాలకు వేళాయే..



గుట్టపై గుహలో మైబుసుభానీ

● నేటి నుంచి టేకూర్‌లో మొహర్రం సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మొహర్రం వచ్చిందంటే టేకూర్ గ్రామంలో సందడి నెలకొంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు సమీపాన గల కర్నాటక నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వస్తారు. గ్రామంలో జరిగే పండగకు దశాబ్దాల చరిత్ర ఉండగా.. మొహర్రం ముగిసిన రోజు నుంచి రెండు రోజుల పాటు ఇక్కడ పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామం పక్కనే ఉన్న కొండగుట్టపై మహిమాన్వితమైన దర్గా ఉంది. ఆ దర్గాను దర్శించుకునేందుకు దూది పీర్లతో ప్రజలు వేల సంఖ్యలో తరలివస్తారు. కుల, మతాలతో సంబంధం లేకుండా అన్నివర్గాల వారు ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామం నడిబొడ్డున ప్రజలు పాటలు పాడుతూ రెండు రోజుల పాటు రుమాళ్ల ఆటతో సందడి చేస్తారు. అయితే టేకూర్ సమీపంలోని గుట్టపై ఉన్న గుహలో వందల ఏళ్ల క్రితం వెలసిన మైబుసుభాని దర్గా మహిమ వల్లే ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దూది పీర్లు వస్తాయని పలువురు చెబుతున్నారు. ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం తెలిపారు.

బాధితులకు పరామర్శ

నారాయణఖేడ్: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పలువురు బాధితులను శనివారం పరామర్శించారు. కల్హేర్ మండలం దేవునిపల్లికి చెందిన మల్కయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన పుట్టి గంగమణి ప్రమాదవశాత్తు ఇంటి భవనంపైనుంచి పడి తీవ్రంగా గాయపడింది. ఇద్దరూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 10 కోట్లు మంజూరు చేసిందును కుగానూ శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, కమిషనర్ గోపు మల్లారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. నమ్లిమేట్ పంచాయతీ పరిధిలోని దుబ్బ తండా, గుండు తండా, నాన్యానాయక్ తండాలు కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా తండావాసులు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



అధ్వానంగా రోడ్డు



గుంతలో కూరుకుపోయిన డీసీఎం

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా తెల్లాపూర్ హుడా ప్రధాన రహదారిని తవ్వి హెచ్‌ఎండీఏ అధికారులు డ్రైనేజీ పైపులైన్లు వేశారు. అయితే పనులు పూర్తయినప్పటికీ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక వైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వర్షాలతో సమస్య మరింత జటిలంగా మారింది. పైపులైన్ వేసిన రోడ్డుపై నుంచి వాహనాలు పోవడంతో అవి గుంతలో ఇరుక్కుపోతున్నాయి. అక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై ఏఈ సంజయ్‌ని వివరణ కోరగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్డు అభివృద్ధికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని.. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

ధైర్యంగా ఉండండి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి నీలం మధు పరామర్శ



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ పరామర్శించారు. సొంత మామ చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరుకాలేక పోయానన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేవుడు ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని కోరారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎంపీడీఓ రాములు ఆధ్వర్యంలో జిన్నారంలోని శిథిలావస్థకు చేరిన ఐదు ఇళ్లను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బొల్లారంలో శిథిలావస్థలో ఉన్న 30 ఇళ్లను మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు గుర్తించారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

వట్‌పల్లి(అందోల్): దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధికారులను ఆదేశించారు. గుంతలమయంగా మారిన అల్లాదుర్గ్ నుంచి మెటల్‌కుంటకు వెళ్లే రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరైనా పనులు సాగకపోవడంపై గల కారణాలపై ఆరా తీశారు. మరో కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టి ప్రజా రవాణా సౌకర్యానికి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంత్‌నాయక్, ఈఈ అర్పుపస్, డీఈఈ రాము రాథోడ్ ఉన్నారు.



అధికారులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రాయికోడ్(అందోల్): మండలంలోని మహబత్‌పూర్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్ప పాటిల్, జైపాల్, పాండు, శ్రీనివాస్, రవి, సుధాకర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న డీసీఎంఎస్ చైర్మన్

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కాపాడి మాతవత్వాన్ని చాటుకున్నారు. జహీరాబాద్ బైపాస్ రోడ్డులో పస్తాపూర్ వద్ద బైక్‌ను డీసీఎం ఢీకొన్న సంఘటలో గుర్తుతెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో పస్తాపూర్ వైపు వెళ్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తన కారును ఆపి ప్రమాదంలో గాయపడిని వ్యక్తిని పరామర్శించారు. వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు.

సంక్షిప్త వార్తలు


◆ శిథిలావస్థలో ఇళ్లు

మునిపల్లి (అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 29 ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని ఆర్‌ఐ రవీందర్‌రావు శనివారం తెలిపారు. వివరాలు సేకరించి సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని చెప్పారు.

◆ నివాళి

జహీరాబాద్ టౌన్: ఉద్యమకారుడు పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకుడు నర్సింలు మాట్లాడుతూ.. అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా సాయన్న పోరాటం చేశాడని కొనియాడారు. ముదిరాజ్ సంఘం నాయకులు కృష్ణ, అశోక్, చంటి, పవన్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

◆ అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



సాయి కిషోర్ (ఫైల్)

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని కాశిపూర్ మండల ప్రజాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సాయికిషోర్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన పెద్ద శంకరంపేటలో శనివారం నిర్వహించారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సిబ్బంది బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

◆ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

పటాన్‌చెరు టౌన్: కాలేయ వ్యాధులపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధి సాంబరాజు అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో ఆరోగ్య శిబిరం నిర్వహించి కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య శిబిరంలో దాదాపు 80 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

హత్నూర (సంగారెడ్డి): అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందని జెడ్పీటీసీ ఆంజనేయులు అన్నారు. శనివారం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌కు చెందిన బక్కయ్య ఎల్లయ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ రూ. 18,000 చెక్కును అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీ వీరస్వామి, నాయకులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

◆ భక్తుల కోసం ప్రత్యేక బస్సులు

జహీరాబాద్ టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని కర్నాటకలోని దత్తాత్రేయ స్వామి పవిత్ర పుణ్యక్షేత్రమైన గాణగాపూర్‌కు జహీరాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ రజనీకృష్ణ తెలిపారు. ఆగస్టు 1న ఉదయం 9 గంటలకు ప్రత్యేక డీలక్స్ బస్సు బయలుదేరి వెళ్తుందన్నారు. చార్జీ రూ. 250 నిర్ధారించామని చెప్పారు. పూర్తి వివరాలకు 9959226269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

◆ సన్మానం

న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్ ఎస్‌ఐగా నియమితులైన రామానాయుడును శనివారం నాయకులు బస్వరాజ్, ప్రవీణ్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కమ్మరి రాజు, సిద్దు పాల్గొన్నారు.

◆ 80 మంది దరఖాస్తు

సదాశివపేట(సంగారెడ్డి): ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు పట్టణంలోని 6వ వార్డు కృష్ణనగర్ కాలనీకి చెందిన 80 మంది యువకులు కౌన్సిలర్ గుండు రవి ఆధ్వర్యంలో శనివారం దరఖాస్తు చేసుకున్నారు. శనివారం చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఆయన కుమారుడు సాయినాథ్‌కు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో మొన్నసింగ్, కిరణ్, మల్లేశం, అక్రమ్, నర్సింలు పాల్గొన్నారు.

◆ కొవ్వొత్తుల ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సేవ్ మణిపూర్ అంటూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో శనివారం కాంగ్రెస్ నాయకులు కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి అక్కడి మహిళలను, ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు.

◆ మంగల్‌పేట్‌లో వైద్య శిబిరం

నారాయణఖేడ్: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు సోకినవారికి చికిత్సలు అందించేందుకుగాను నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు సంబంధించి మంగల్‌పేట్‌లోని సమగమేశ్వర ఆలయం ఆవరణలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు, సిబ్బంది జలుబు, దగ్గు తదితర వాటికి సంబంధించిన చికిత్సలు అందించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్ కోరారు.

◆ కేతకీలో ఆర్డీఓ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయాన్ని జహీరాబాద్ ఆర్డీఓ వెంకారెడ్డి శనివారం సందర్శించారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఆర్డీఓ పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

◆ రుద్ర చండీయాగంలో పాల్గొన్న మాజీ ఎంపీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సత్యసాయి కాలనీలోని మహతి జ్యోతిష్యాలయంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వేదపండితులు గురు జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రచండీ యాగం శనివారం కొనసాగింది. మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

◆ జీరో బ్యాంక్ అకౌంట్ తెరవాలి

హత్నూర (సంగారెడ్డి): ఆరో తరగతి నుంచి పై తరగతులు చదువుతున్న విద్యార్థులు ఇండియన్ బ్యాంకులో జీరో అకౌంట్ ఖాతా తెరవాలని బ్యాంక్ మేనేజర్ ప్రత్యూష సూచించారు. శనివారం హత్నూర మండలం నస్తీపూర్ మహిళా సమైక్య భవనంలో ఆరో తరగతి పైబడి చదువుతున్న విద్యార్థుల నుంచి జీరో దరఖాస్తు ఫారాలను స్వీకరించారు.

◆ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బోరుపట్ల గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, మెదక్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ పిల్లలకు గమ్యం అసోసియేషన్ చైర్మన్ సురేందర్‌రెడ్డి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శనివారం హత్నూర మండలం సాధుల్‌నగర్‌లోని ముత్యాల ప్రభు దంపతులు చనిపోగా.. అనాథలుగా మారిన చిన్నారులు అనిల్, ఐశ్వర్యలకు గమ్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.